క్లుప్తంగా

కేఎల్‌ఐ కాల్వ ద్వారా సాగునీరు అందించాలి

ఉప్పునుంతల: మండలంలోని తాడూరు, కాంసానిపల్లి, కాంసానిపల్లితండా, తిప్పాపూర్, కొరటికల్, వెల్టూరు తదితర గ్రామాలకు కేఎల్‌ఐ కాలువల ద్వార మరో నెలరోజుల పాటు సాగునీరు అందించాలని కాంసానిపల్లి బీఆర్‌ఎస్ నాయకుడు కొట్టె శ్రీనివాసులు యాదవ్, సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు సోమవారం వేర్వేరు ప్రకటనలలో అధికారులను కోరారు. యాసంగి పంటలు చేతికి రాకముందే కాలువ వెంట నీరు నిలిపేయడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కాల్వ వెంట నీరు వదిలి పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందని కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని శిర్సవాడ, ఐతోలు పాఠశాలల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహణ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ

వంగూరు: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సబ్జెక్టు ప్రతిభా పరీక్షల్లో మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన నిహారిక 2వ స్థానం పొందింది. పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిహారిక జీవశాస్త్రంలో నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. సోమవారం గురుకులాల డైరెక్టర్ రమణకుమార్, ఎంఈఓ మురళీమనోహరాచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయుడు శివానందాచారిలు విద్యార్థినిని అభినందించారు.

ఫ్రీ చికెన్, ఎగ్ మేళా

కందనూలు: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా సోమవారం వేంకటేశ్వర హ్యాచరీస్ కంపెనీ, నాగర్‌కర్నూల్ చికెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రీ చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ నర్సారెడ్డి మాట్లాడుతూ చికెన్ తినడంలో వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని అపోహలను తొలగించాలనే ఉద్దేశ్యంతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నర్సారెడ్డి, నాగర్‌కర్నూల్ చికెన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంతో పాటు ఎత్తం, జనుంపల్లి, తీగలపల్లిలో ఎస్‌ఐ గోకారి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ఆర్సీ, హెల్మెట్ తప్పనిసరిగా దగ్గరగా ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఇస్మాయిల్, వేణు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

మన్ననూర్: లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాయలగండి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇమ్మడి నరహరి, ప్రధాన కార్యదర్శి మద్దెల ఆనంద్ తెలిపారు. పదర మండలం రాయలగండి క్షేత్రంలో మార్చి 4 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో 4,5,6 తేదీల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి మొదటి బహుమతి రూ. 30వేలు, రెండో బహుమతి రూ. 20వేలు, మూడో బహుమతి రూ. 10వేలు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి కోలాటం, భజన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని ఐనోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులకు డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, ఐనోల్ ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు స్కూల్ హెచ్‌ఎం బాలస్వామి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు జె. శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, శ్రీనివాసమూర్తి, అర్జునయ్య, గోపాల్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, రాములు, బలరాం, నాను, తుకారాం, రవి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

తిమ్మాజిపేట: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని మరికల్‌లో సోమవారం నర్సరీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు మొక్కలకు నీళ్లు పట్టాలని సూచించారు. కార్యదర్శి యాదయ్య, ఖాజా ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో వెలసిన శివుడు


అలంకరణలో పార్వతిదేవి అమ్మవారు

వెల్దండ: మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంగా ఉన్న గుండాలలో మరో దక్షిణ కాశీగా పేరుగాంచిన అంబా రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అదే విధంగా కల్వకుర్తి ఆర్టీసీ డిపో అధికారులు కల్వకుర్తి నుంచి గుండాల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈనెల 25 నుంచి ఉత్సవాలు..

గుండాలలోని అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 25 నుంచి మార్చి 12వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 25న ఆలయ ప్రదక్షిణ, గోపూజ, శ్రీ మహాగణపతిపూజ, యాగశాల ప్రవేశం నిర్వహిస్తారు. 26వ తేదీన మహాశివరాత్రి, రుద్రాభిషేకం, అంబాపరమేశ్వరీదేవికి అభిషేకం, అలంకరణ, లలితా అష్టోత్తర కుంకుమార్చన, రాత్రి 10 గంటలకు అంబారామలింగేశ్వర స్వామి కల్యాణమహోత్సవానికి అన్ని ఏర్పాటు చేశారు. 27న ఉదయం 9 గంటలకు ప్రాతరౌపాసన, రుద్రవాహనం, మూలమంత్ర హవనములు, సాయంత్రం 6 గంటలకు సాయమౌపాసన, యాగశాల బలిహరణ పూజలు, 28వ తేదీన ఉదయం 9 గంటలకు రుద్రపారాయణ, సూర్యనమస్కారం, వాస్తుబలిహరణ, సాయంత్రం 6 గంటలకు శాంతికుంభస్థాపన, ఆలయ దేవతాహ్వానములు, బలిహరణ నిర్వహించనున్నారు. మార్చి1న నిత్యపూజ కార్యక్రమాలు, మార్చి 2న తెల్లవారుజామున 3గంటలకు పుష్పరథోత్సవము, (చిన్నతేరు), మార్చి4న ఏకాదశ రుద్రాభిషేకం, అంబా పరమేశ్వరిదేవికి క్షీరాభిషేకం, అలంకరణ, విశేష మంగళ ద్రవ్యములతో కుంకుమార్చన, రాత్రి2గంటల సమయంలో పెద్దరథోత్సవములు(పెద్దతేరు) ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

> **అన్ని ఏర్పాట్లు చేశాం**
>
> 
>
> బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. రూ.2.90 లక్షలతో నూతన స్నానాల గదులను నిర్మిస్తున్నాం. అదే విధంగా ఆలయ ఆవరణంలో రూ.12లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించాం. 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్‌కు చర్యలు తీసుకున్నాం.
>
> – సందీప్‌రెడ్డి, ఆలయ చైర్మన్, గుండాల దేవాలయం

5న వృషభ వాహనసేవ, 6న హంస వాహన తెప్పోత్సవం, రాత్రి 9గంటలకు నాకబలి, 7 నుంచి 11వ తేదీ వరకు నిత్యపూజ కార్యక్రమాలు, 12న విశేష అలంకరణ, అమ్మవారికి వడిబియ్యము సమర్పణ మహ మంగళహారతి, రాత్రి 9గంటలకు స్వామి వారి గ్రామోత్సవముతో ఉత్సవాలు ముగుస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు వివరించారు.


గుండాలలోని దేవాలయం

పదో తరగతి పరీక్షలు మొదటి మెట్టు

లింగాల: పదో తరగతి పరీక్షలు ఉన్నత చదువులకు మొదటి మెట్టని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కుర్ర కిషన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 107 మంది విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బషీర్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్, కార్యదర్శి యాదగిరి, కోశాధికారి ఆనంద్, యూటీఎఫ్ ఉప్పునుంతల మండల అధ్యక్షులు మల్లికార్జున్, ఇన్‌చార్జి హెచ్‌ఎం కొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాకే గర్వకారణం



ఊర్కొండ: వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 34వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో నాగర్ కర్నూల్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలవడం జిల్లాకే గర్వకారణం అని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రతిభచాటిన క్రీడాకారులను ఊర్కొండపేటలో అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు మ్యాకల శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్ అసోసియేషన్ సభ్యులు మోహన్, డాక్యానాయక్, కోచ్ గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాంసం విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో మాంస విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలని కోరుతూ సోమవారం పట్టణవాసులు జిల్లా వెటర్నరీ అధికారి జాఫర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాసం విక్రయ దారులు అనారోగ్యాల పాలైన గొర్రెలను కొనుగోలు చేసి పొట్టేలు మాంసంగా చిత్రీకరించి విక్రయిస్తున్నారని వివరించారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మాంసం విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకరయ్య, ఏటిగడ్డ శ్రీనివాసులు, యాదయ్య, నిరంజన్ యాదవ్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉపాధ్యాయ బృందం వెనచెర్లలోని ప్రభుత్వ పాఠశాలలో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలను, కూరగాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రధాన ఉపాధ్యాయులు రాములు, నందకిషోర్, కేజీబీవీ ఏఎస్‌ఓ లత, మహేష్‌లు పాల్గొన్నారు.



వైభవంగా గంగాభవాని కల్యాణోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని గంగాభవాని కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం గంగమ్మ గుడిలో గంగపుత్రులు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.. దేవతా మూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య కల్యాణ తంతు కొనసాగించారు. సాయంత్రం పట్టణంలోని ప్రధాన వీధులగుండా దేవతామూర్తుల ఊరేగించారు. గంగపుత్ర కులస్తులు భజనకీర్తనలు ఆలపించారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఊరేగింపులో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, గంగపుత్ర సంఘం నాయకులు నక్కబిచ్చన్న, పూరి సుధాకర్, పెద్దూరి లక్ష్మయ్య, మద్దిలేటి, రాములు, పిట్టల సుధాకర్, వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.


కొల్లాపూర్‌లో కల్యాణోత్సవంలో పాల్గొన్న గంగపుత్ర కులస్తులు

తాడూరులో..

తాడూరు: మండల కేంద్రంలో శివమాలధారులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. స్వామిఅమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన శివపార్వతుల పల్లకిలో ఊరేగించారు.

వేదమంత్రోచ్చరణల మధ్య..

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో ఆలయ పూజారుల వేదమంత్రోచ్చరణల మధ్య లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఆండాలమ్మ, లక్ష్మీనరసింహస్వామి ప్రతిమలు ఏర్పాటుచేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు విరమణ

చారకొండ: బైపాస్ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 14 వ రోజుకు చేరుకుంది. బాధితులతో తహసీల్దార్ సునీత, డీటీ విద్యాధరి రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో చర్చలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఫోన్‌లో అధికారులు సమస్యను తెలపగా బాధితులకు న్యాయం చేస్తామని, ప్రభుత్వ స్థలంలో 20 రోజుల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బైపాస్ బాధితులు రిలే నిరాహార దీక్షలను తాత్కాలికంగా విరమించారు.

ఎంపీడీఓకు వినతి..

చారకొండ: మండలం కేంద్రంలో బైపాస్ బాధితులకు 2018లో గత సర్పంచ్ కాలంలో సర్వే నం. 80లో 24 మంది బాధితులకు 155 గజాల స్థలం కేటాయించినట్లు వెంచర్‌లో సంబంధిత సర్టిఫికెట్లను అందించారని ప్రస్తుతం వారికి స్థలాన్ని గుర్తించి పొజిషన్ ఇవ్వాలని చారకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ వెంకటేష్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు, కార్యవర్గ సభ్యులు అంజనేయులు, చింత అంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, బాధితులు రాజు, అశోక్, వెంకటమ్మ, బాల్‌నారి, అనసూయ, రాములమ్మ, సుమతమ్మ, లాలమ్మ, కిరణ్, లింగమయ్య, తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందిస్తున్న బాధితులు

అదనపు కలెక్టర్‌కు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: డిప్యుటేషన్స్ పేరుతో కొనసాగుతున్న బదిలీలను వెంటనే నిలిపివేయాలని జిల్లా స్వేరోస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. తెలకపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని కొన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను డిప్యుటేషన్ పేరుతో బదిలీ చేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. మండలంలోని 12 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయడంలో రాజకీయ నాయకుల కుట్ర దాగి ఉందని, డిప్యుటేషన్ బదిలీలను రద్దు చేయాలని, యథావిధిగా ఆయా స్థానాలలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, ధర్మరాజు, సంపత్‌కుమార్, బాలకృష్ణ, కాశన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

వెల్దండ: ప్రతి వాహనానికి ఖచ్చితంగా నంబర్ ప్లేట్లు, పేపర్లు ఉండాలని ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాలను ఆకస్మిక తనిఖీ చేశారు. నంబర్‌ప్లేట్లు, పూర్తిస్థాయిలో పత్రాలు లేని 10 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వాహనాలను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు.

పోచమ్మ దేవతకు బోనాలు



కొల్లాపూర్: పట్టణంలో మూడో సోమవారం భక్తులు పోచమ్మ దేవతకు బోనాలు ఎత్తుకొని నైవేద్యాలు సమర్పించారు. పట్టణంలోని రంగదాసు వీధి, ఆర్టీసీ బస్‌డిపో పక్కన 16 వవార్డులో వరిదేల చెరువుకట్ట కింద ఎస్సీ హాస్టల్ సమీపంలో గల పోచమ్మ గుడుల వద్దకు స్థానిక ప్రజలు బోనాలెత్తుకొని వెళ్లారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల ఏర్పాట్లను రైతుసంఘాల నాయకులు పర్యవేక్షించారు.

అజిలాపూర్‌లో మల్లీశ్వరస్వామి ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మల్లీశ్వరస్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ నెల 25న దేవాలయంలో విగ్రహాలకు ఉదయం సుప్రభాత సేవలతో పూజలు ప్రారంభకానున్నాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేసి అలంకరణ కార్యక్రమం, 26వ తేదీన సుప్రభాత సేవ, స్వాములకు ప్రత్యేక అభిషేకం చేస్తారు. సాయంత్రం ప్రత్యేక ఒగ్గుకథ ప్రారంభవుతోంది. మధ్యాహ్నం గ్రామంలో ప్రధాన వీధుల గుండా స్వామివారి శోభాయాత్ర, సాయంత్రం గంగ తెప్ప నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు మల్లీశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, రాత్రి 11.36 గంటలకు మహారుద్రాభిషేకం, చంద్రపటాలు, అగ్ని గుండాలు, ఈనెల 27వ తేదిన ఉదయం 6గంటలకు మల్లన్న, ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పణ చేయనున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో భక్తబృందం సభ్యులు ఉన్నారు.


మల్లీశ్వర స్వామి మూలవిరాట్ విగ్రహాలు

పంచలోహ విగ్రహాల బహూకరణ

వెల్దండ: మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయానికి సోమవారం కల్వకుర్తి పట్టణానికి చెందిన కుడుముల కిషోర్‌రెడ్డి, చైతన్య దంపతులు పంచలోహ విగ్రహాలను బహూకరించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి హోమం నిర్వహించారు. వేదమంత్రోత్సవాల మధ్య కలశస్థాపన బింబ చైతన్య శుద్ధి కోసం సర్వకల్యాసం హోమం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం శివపార్వతుల పంచలోహ విగ్రహాలను పల్లకి సేవతో ఆలయ ప్రదక్షిణం చేశారు. విగ్రహ దాతలకు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ, నాయకులు పర్వత్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రఘుమారెడ్డి, తదితరులు ఉన్నారు.


పంచలోహ విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న దాతలు, భక్తులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజావాణిలో డీఆర్‌ఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో జర్నలిస్టులు బతుకులు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పరిపూర్ణం, నాగర్‌కర్నూల్ టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కాలూరు శ్రీను, జాతీయ కౌన్సిల్ సభ్యులు భాస్కర్ జర్నలిస్టులు మల్లికార్జున సాగర్, కారంగి గోవింద్, జల్లాపూరం సురేందర్, జిల్లా ప్రచార కార్యదర్శి బాదం పరమేష్, భాను ప్రకాష్, పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రోగులకు మెరుగైన సేవలు అందిస్తాం



నాగర్‌కర్నూల్ క్రైం: జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు అన్నారు. సోమవారం జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓలు డా. దశరథం, డా. ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సద్గుణ, వేదవతి, యూనియన్ ప్రెసిడెంట్ జానకిదేవి, జనరల్ సెక్రెటరీ ఆనంద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అమ్రాబాద్: మండల కేంద్రంలోని అమరేశ్వరాలయం అర్చకులు శ్రీనివాసాచారి తల్లి ఇందిరమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. అదేవిధంగా ఇటీవల మోటార్‌మెకానిక్ సుధాకర్‌చారి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట మాజీ వైస్‌ఎంపీపీ సంబుశోభ, ప్రణీత, తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రం నుంచి గగ్గలపల్లి వెళ్లే దారిలో చందాయిపల్లి గ్రామ శివారులో డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించాలని శ్రీరామ సేవ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం డంపింగ్ యార్డు దగ్గరికి వెళ్లి వ్యర్థాలను పరిశీలించారు. డంపింగ్ యార్డు చుట్టు వ్యవసాయ పొలాలు ఉండడం వల్ల డంపింగ్ యార్డు నుంచి దుర్వాసనతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు గుండా మల్కాపూర్, పులిజాల, గగ్గలపల్లి, నడిగడ్డ తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నారు. శ్రీనివాసులు, తీగల భాస్కర్, పాలమూరు శంకరయ్య, వీరయ్య, వేణురావ్, రాగిశెట్టి, పుల్లయ్య, దాసరి నిరంజన్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

అచ్చంపేట రూరల్: అర్హులకే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అగ్రవర్ణ పేదలకు మాత్రమే వర్తిస్తుందని, ధనవంతులు, ఉద్యోగం చేసే కుటుంబాలకు సర్టిఫికెట్లు ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లపై ప్రభావం చూపుతోందన్నారు. తహసీల్దార్, ఆర్‌ఐ అన్ని పరిశీలించాకే సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆనంద్, పర్వతాలు, ప్రభాకర్, విజయ్, ఎల్లస్వామి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని మహిళ మృతదేహం సోమవారం జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం చెరువులో లభ్యమైంది. పోలీసుల, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం కేసరి సముద్రం చెరువులోని బతుకమ్మ ఘాట్ వద్ద నీటిపై గుర్తు తెలియని మహిళ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపడితే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు

ఉప్పునుంతల: మన ఇసుక వాహనం ద్వారా అభివృద్ధి పనుల పేరిట అనుమతులు పొందుతూ నిబంధనలు పాటించకుండా మండలంలోని పెద్దాపూర్ సమీపంలో దుందుబీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాగు నుంచి ఇసుకను సేకరించాల్సి ఉండగా సాయంత్రం 6 గంటల వరకు ఇసుకను ట్రాక్టర్లకు నింపుతున్నారని తెలిపారు. జిల్లా అధికారులు అక్రమంగా తరలిస్తున్న ఇసుకను నియంత్రించాలని కోరారు.